# సాక్షి వికారాబాద్

మంగళవారం । 18 । మార్చి । 2025







## 'పది' పరీక్షలకు సిద్ధం

పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. 9లో▸



## దుమ్మెత్తి పోస్తున్న రోడ్డు

యాలాల మండలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళవారం సా. 6.32 గం. | బుధవారం ఉ. 5.00 గం. |



### ❖ నీళ్ల కోసం నిరసన

ధారూరు మండలం స్టేషన్ ధారూరులోని 8వ వార్డుకు తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ కాలనీలో దాదాపు 150మంది ఉన్నారు. బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మోటారు కాలిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో సోమవారం సమీప రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- ధారూరు



### ❖ ప్రజావాణికి ఏదీ స్పందన..?

ప్రజావాణికి ఆదరణ తగ్గుతోంది.. గ్రామ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే ప్రజల నుంచి పెద్దగా స్పందన లేదు. గతంలో అధికారులకు ఇచ్చిన అర్జీలు పరిష్కరించకపోవడమా? లేక కార్యక్రమంపై అవగాహన లేకపోవడమా అనేది సందేహంగా మారింది. సోమవారం దుద్యాల్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒకే అర్జీ వచ్చింది. దుద్యాల్‌కు చెందిన మహిళ రైతుబంధు నగదు పడటం లేదని ఫిర్యాదు చేసింది.

- దుద్యాల్



### ❖ సమస్యల పరిష్కారానికి ఆందోళన

తాండూరు పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. పలు వార్డుల్లో తాగునీటి సమస్య, డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని నేతలు ఆరోపించారు. వెంటనే స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు రాజు, సురేష్, నారాయణ పాల్గొన్నారు.

- తాండూరు టౌన్

## న్యూస్‌రీల్

### ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేయండి

కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేత్‌ను కోరిన ఎంపీ కొండా



కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**అనంతగిరి:** వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేత్‌ను కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయన్ను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, చేవెళ్ల నియోజకవర్గ విద్యార్థుల కోసం వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తితోపాటు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో కూడా రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ఏడాది ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం జరిగిందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

### బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి



**పరిగి:** బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కొప్పు రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం పార్టీ రాష్ట్ర శాఖ ఎనిమిది జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. ఈ జాబితాలో రాజశేఖర్‌రెడ్డికి చోటు లభించింది. జిల్లా అధ్యక్ష పదవి కోసం పార్టీ సీనియర్ నాయకులు శివరాజ్, సదానందరెడ్డి, రమేష్, వడ్ల నందు, రాజశేఖర్‌రెడ్డి పోటీపడ్డారు. అధిష్టానం రాజశేఖర్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది.

### ఇంటివద్దకే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు



**పరిగి:** ఇంటి వద్దకే భద్రాద్రి సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలు ఆర్టీసీ అందిస్తుందని రంగారెడ్డి రీజియన్ లాజిస్టిక్ ఏటీఎం రవీందర్ అన్నారు. సోమవారం పరిగి కార్గో కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రెండు దఫాలుగా భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ కార్గో భక్తులకు అందజేసిందన్నారు.భక్తులు రూ.151 చెల్లించి ముందుగానే బుక్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం జరుగుతుందని.. ఏప్రిల్ 7వ తేదీ వరకు దగ్గరలోని కార్గో సెంటర్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

### గ్రూప్‌-3లో సత్తాచాటిన శ్రవణ్‌కుమార్



**కుల్కచర్ల:** తెలంగాణ గ్రూప్‌-3 ఫలితాల్లో కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లికి చెందిన శ్రవణ్‌కుమార్ సత్తాచాటారు. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో 208వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం శ్రవణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా సాతంరాయి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

# అగ్గి.. బుగ్గి

**వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు**

- కేర్‌లెస్ స్మోకింగ్ కూడా ఓ కారణం
- ఫైర్ సేఫ్టీ లేకుండానే విద్యా సంస్థలకు అనుమతులు
- తనిఖీలు చేయని అధికారులు



ధారూరు: ఆదివారం రాత్రి ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రాస్నం అడవికి నిప్పు పెడుతున్న అక్రమార్కులు

**వికారాబాద్:** ఎండాకాలం వచ్చేసింది.. రోజురోజుకూ ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఏటా వేసవిలో వందల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. మన జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో గడ్డి వాములు, వ్యవసాయ ఉత్పత్తులు, చేతికొచ్చిన పంట తగలబడటం చూస్తూనే ఉన్నాం. వీటి నివారణకు అగ్నిమాపక అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు.. ప్రమాదాలు సంభవించే సమయంలో తక్షణ చర్యలు తీసుకుంటే ప్రమాదస్థాయిని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొంటున్నారు. ప్రైవేటు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించే సమయంలో ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖ సర్టిఫికెట్లు లేకుండానే విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర సంస్థలు నిర్వహిస్తున్నారు. అధికారులు కూడా సర్టిఫికెట్లు లేకుండానే అనుమతులు ఇస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

**చాలా పాఠశాలల్లో..**

జిల్లాలోని చాలా పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు, ఆస్పత్రులు, అపార్టుమెంట్లు ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. అగ్ని ప్రమాద నివారణ పరికరాలు కూడా అమర్చుకోవడంలేదు. జిల్లాలో దాదాపు 50 ప్రైవేటు పాఠశాలలు, 50 ఇంటర్, డిగ్రీ కళాశాలలు,10 సినిమా థియేటర్లు, 50 ఫంక్షన్ హాళ్లు, 200 పైచిలుకు ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో పది శాతం మినహా మిగిన వాటికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేకుండానే నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు చేయకుండా సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే హెచ్చరించే పరికరాలు, నియంత్రించే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ వీటిని ఎవరూ వినియోగించడం లేదు.

**ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు**

- స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లను అమర్చుకోవాలి.
- సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్లు వాడాల్సి ఉంటుంది.
- స్కూళ్లు, ఆస్పత్రుల్లోకి, బయటకు వెళ్లే మార్గాల్లో అటంకాలు లేకుండా చూసుకోవాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్లాల్సివస్తే ఎలక్ట్రిక్ మేయిన్ స్విచ్, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ స్టౌ రెగ్యులేటర్ పైపును ఆరు నెలలకోసారి తప్పనిసరిగా మార్చాలి. మండుతున్న స్టౌలో కిరోసిన్ పోయరాదు.
- తాటాకులు, గడ్డి తదితర మండే పదార్థాలతో చేసిన పైకప్పులు స్కూళ్లు, ఆస్పత్రులకు వాడొద్దు.
- షాక్ సర్క్యూట్ బ్రేకర్స్ పరికరాలను అమర్చుకోవాలి. గోదాములు, గిడ్డంగుల్లో స్టాక్‌ను చెక్క స్లీపర్లపై నిల్వ చేసుకోవాలి. నీరు అగ్నిమాపక సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- వేసవిలో సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే వంట చేసుకోవాలి. వంట సమయంలో కాటన్ దుస్తులు వాడటం మంచిది.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలు ఆర్పకుండా పడేయరాదు. ఇళ్లలో ఐఎస్‌ఐ మార్కింగ్ కలిగిన వైర్లను మాత్రమే వాడాలి.
- చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, టపాకాయలు, లైటర్లు అందుబాటులో ఉంచకూడదు.
- పంట పొలాల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. గడ్డి వాములు, పంట నూర్పిడులు, ధాన్యం తగలబడి భారీ నష్టానికి దారి తీస్తుంది. వీటి వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు గడ్డి వాములను ఆవాసాలకు దూరంలో ఉండేలా చూసుకోవాలి. గడ్డి వాములు ఒకదాని పక్కన ఒకటి ఉండకుండా ఏర్పాటు చేసుకోవాలి.

### అడవికి నిప్పుపెడితే చర్యలు

**ధారూరు:** ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అడవిని కొంతమంది అక్రమార్కులు తగులబెట్టి సాగుభూమిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అసైన్డ్ పట్టాల కోసం కొందరు అడవిని దగ్ధం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రాస్నం అడవికి కొంతమంది అక్రమార్కులు నిప్పు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిపై చర్యలు ఉంటాయన్నారు. దోర్నాల్, పగిడ్యాల, కమాల్‌పూర్, రాస్నం, బాజాపూర్, బిజ్వారం, సంగాయపల్లి తండా, తిమ్మాయపల్లి, అడాల్‌పూర్, జుంటుపల్లి, గంగాసాగర్ అటవీ ప్రాంతంలోకి రాత్రి వేళ అక్రమార్కులు ప్రవేశించి చెట్లకు నిప్పు పెడుతున్నారని పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉంటాలని, ఇలాంటి వారిపై దృష్టి సారించాలని సూచించారు. అడవికి నిప్పు పెడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### అవగాహన ఉండాలి



అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి.. ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పెట్రోల్ బంకుల్లో మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లు, ఆస్పత్రులు, గోదాములు, పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించే సాధనాలను అమర్చుకోవాలి. జిల్లాలో చాలా వాటికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేవు. అలాంటి వాటికి నోటీసులు ఇస్తాం.

– పూర్ణచందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

**జిల్లాలో 2022-24 మధ్య జరిగిన అగ్ని ప్రమాదాలు**

| ఏడాది | జరిగిన ప్రమాదాలు | నష్టం కోట్లలో | ప్రాణ నష్టం |
|---|---|---|---|
| 2022 | 154 | 4.17 | 10 |
| 2023 | 146 | 3.37 | 09 |
| 2024 | 147 | 3.04 | 06 |

# అప్రమత్తతే.. సైబర్ నేరాలకు అడ్డుకట్ట



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

**తాండూరు టౌన్:** అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక వినాయక కన్వెన్షన్ హాల్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వ్యాపారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన ఉంటే వాటి నుంచి రక్షించుకోవచ్చన్నారు. సైబర్ నేరాలు అనునిత్యం కొత్త రూపం దాల్చుకుని వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు, ప్రజల నుంచి నగదును దోచేస్తున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు పలు రకాల ఆఫర్లు, ఈజీ మనీ వంటి వాటితో ప్రజలను తప్పుదోవ పట్టించి వారి ఖాతాలను ఖాళీ చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు సుమారు రూ.30వేల కోట్ల నగదును కొట్టేశారని, ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో సైతం రూ.6 వేల కోట్ల మేర నగదును అమాయకులు పోగొట్టుకున్నారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా నంబర్, కేవైసీ, పొరపాటున ఖాతాలోకి నగదు జమ చేశామని, ఏటీఎం కార్డు అప్‌డేట్ చేయాలని, లోన్స్ ఇస్తామని, మీ పేరుపై వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, మీకు సంబంధించిన వారు కేసులో ఇరుక్కున్నారని పలు రకాలుగా సైబర్ దాడులు జరుగుతున్నాయని అన్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఎక్కడా లేదని, లోకల్ పోలీసులు మీపై కేసు నమోదయ్యిందని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వరన్నారు. ఇలాంటి సైబర్ దాడుల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాలన్నారు. ఇందుకు నిర్లక్ష్యం, భయాన్ని వీడి, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రశాంత్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాలపై ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేపట్టాలన్నారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో పడి నగదు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. దీనివల్ల కొట్టేసిన నగదును పలు బ్యాంకు ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ కాకుండా అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకున్నారో, అలాగే సైబర్ నేరగాళ్ల నుంచి జరిగే దాడులను కూడా అరికట్టుకోవచ్చని తెలిపారు. అవగాహన అనేది ఒక టీకా లాంటిదని, అది ఎలాంటి ప్రమాదాలు దరిచేరకుండా రక్షిస్తుందన్నారు. అనంతరం సైబర్ నేరాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తాండూరు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జయప్రసాద్, డాక్టర్ అనిల్‌కుమార్, సీఐలు సంతోష్ కుమార్, నగేష్, ఎస్సైలు రమేష్, శంకర్ పాల్గొన్నారు.

**ఐవీఎఫ్ సేవలు అభినందనీయం**

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవలు అభినందనీయమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వినాయక కన్వెన్షన్ హాల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐవీఎఫ్, తాండూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ఆటో డ్రైవర్లకు ఎస్పీ చేతుల మీదుగా యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐవీఎఫ్ పలు సామాజిక కార్యక్రమాలు, సహాయ సహకారాలు అందించడం హర్షణీయమన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు సంతోష్ కుమార్, నగేష్, ఎస్సైలు రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**తాండూరు రూరల్:** కొందరు కోట్ల రూపాయలు వెచ్చించి ఇల్లు కట్టుకుంటారని, వేల రూపాయల విలువ చేసే సీసీ కెమెరాలు పెట్టుకోరని ఎస్పీ నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో 88 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెర వేయ్యి కళ్లతో సమానమన్నారు. ప్రతి గ్రామంలో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ పవన్ పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

**అనంతగిరి:** అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు పది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, కార్యదర్శి భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు వనజ, మంజుల, భారతి, ప్రమీల, సత్యమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

**అనంతగిరి:** ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 144 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి

**ఆశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి**

**దోమ:** ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. సోమవారం దోమ మండల కేంద్రంలో మండల ఆశ వర్కర్లతో కలసి మెడికల్ ఆఫీసర్ రజిత, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని నేరవెర్చడం లేదని మండిపడ్డారు. కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని కోరారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివారం, పండుగ సెలవు దినాలను జారీ చేయాలన్నారు. ఏఎన్‌సీ, పీఎన్‌సీ రద్దు చేయాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లిస్తూ పారితోషికంలో సగం మొత్తాన్ని పెన్షన్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ లీవ్స్ తోపాటు 6నెలలు మెడికల్ సెలవులు ప్రకటించాలన్నారు. ఎండాకాలంలో కాటన్ యూనిఫాంలు అందజేయాలని కోరారు. పీఆర్‌సీ బకాయిలు, మూడు సంవత్సరాల లెప్రసీ సర్వే డబ్బులు, మూడు రోజుల పల్స్ పోలియో డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఆశవర్కర్లు అతియాబేగం, పద్మమ్మ, లక్ష్మి, రమాదేవి, బుడ్డమ్మ, యశోద, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులు

**పూడూరు:** మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మేడిపల్లికలాన్ గ్రామంలో రూ.5లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, సల్మాన్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, రాంచంద్రయ్య, పాల్గొన్నారు.

### సమాచారం కోసం సంప్రదించండి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



**అనంతగిరి:** వ్యవసాయ శాఖకు సంబంధించిన రైతు బీమా, రైతు భరోసా, రుణమాఫీ, పీఎం కిసాన్ సమాచారం కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా కోసం అనిల్‌కుమార్(జూనియర్ అసిస్టెంట్) 99892 91049, రైతుభరోసా-పీఎం కిసాన్ సమస్యల కోసం ప్రశాంత్(జూనియర్ అసిస్టెంట్) 90103 39211, రుణమాఫీ మిగతా స్కీంలకు తేజస్ నాయక్(జూనియర్ అసిస్టెంట్) 82473 73976లో సంప్రదించాలన్నారు. జిల్లాలోని రైతులు స్కీంలకు సంబంధించిన సమాచారం కోసం ఈ ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### కోలాటం కళాకారుల ఉత్తమ ప్రదర్శన



రవీంద్రభారతి ఎదుట కోలాటం కళాకారులు

**పరిగి:** మండల పరిధిలోని మిట్టకోడూర్ కోలాటం కళాకారులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఆదివారం రాత్రి నగరంలోని రవీంద్ర భారతిలో ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా అభియాన్ ఆర్ట్స్ అకాడమి సహకారంతో కోలాటం ప్రదర్శించారు. దీంతో ఉత్తమ కోలాట ప్రదర్శించిన కళాకారులకు ఆకాశమే అధ్యక్షురాలు కవిత తదితరులు ప్రశంసా పత్రాలను అందజేశారు. రవీంద్ర భారతిలో ఉత్తమ ప్రతిభ కబర్చిన కళాకారులకు గ్రామస్తులు, మండల వాసులు అభినందిస్తున్నారు.

### షాపింగ్‌కు వెళ్లొచ్చే సరికి చోరీ

**పూడూరు:** రంజాన్ షాపింగ్‌కు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి విలువైన వస్తువులు దోచుకెళ్లిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల కేంద్రానికి చెందిన పర్వీన్‌బేగం, అలీలు భార్యాభర్తలు. ఇరువురూ రంజాన్ పండుగ సందర్భంగా షాపింగ్ చేసేందుకు సోమవారం వికారాబాద్‌కు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి, వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న రూ.53,000 విలువగల బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు పోయిందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అడవిలో మంటలు



తిర్మలాపూర్ అడవిలో పొగలు

**పూడూరు:** వేసవి కాలంలో అడవుల పరిరక్షణ చర్యలు చేపట్టడంలో అటవీ శాఖ అధికారులు విఫలమయ్యారు. వేసవిలో తరచూ అడవులు తగులబడి పోతాయని తెలిసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్ అటవీ ప్రాంతం తగులబడిపోతున్నా ఫారెస్టు అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. స్థానిక నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. గడ్డి పూర్తిగా ఎండిపోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. వేసవిలో అటవీ ప్రాంతంలో కందకాలు ఏర్పాటు తవ్వించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.



# జ్వరమని వెళ్తే.. ప్రాణం తీశారు!

**కుటుంబీకులు, బంధువుల ఆరోపణ**
- ఆస్పత్రి ఎదుట ధర్నా



సామ్యనాయక్ (ఫైల్)

**షాద్‌నగర్‌రూరల్:** జ్వరం వచ్చి ందని ఆస్పత్రికి తీసుకెళ్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామ పంచాయతీ పరిధి లచ్యానాయక్‌తండాకు చెందిన సామ్యనాయక్(50)కు జ్వరం వచ్చిందని కుటుంబ సభ్యులు ఈ నెల 14న పట్టణంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకువచ్చారు. అతన్ని పరీక్షించిన ఆర్ఎంపీ.. తాను నిర్వహిస్తున్న బాలాజీ ఆస్పత్రికి రిఫర్ చేశాడు. అనంతరం అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు.. సామ్యనాయక్‌కు డెంగీ ఉందని చెప్పారు. చికిత్స పొందుతున్న వ్యక్తికి.. ప్లేట్‌లెట్స్ క్రమంగా తగ్గుతుండటంతో.. మెరుగైన వైద్యం




ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

కోసం నగరానికి తీసుకెళ్తామని ఆస్పత్రి యాజమాన్యానికి కుటుంబీకులు చెప్పినా.. వినిపించుకోలేదు. ఇక్కడ మంచి వైద్యం అందిస్తామని చెప్పారు. ఈ క్రమంలో నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. గమనించిన వైద్యులు సీపీఆర్ చేశారు. రోగి మృతి చెందాడని తెలుసుకున్న వైద్యులు, యాజమాన్యం ఆస్పత్రి షట్టర్స్‌ను మూసి వేశారు. మృతుడి కుటుంబీకులు కిందకు వెళ్లి తిరిగి పైకి వచ్చే సరికి.. గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**బంధువుల ఆందోళన**

సామ్యనాయక్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆదివారం అర్ధరాత్రి బాలాజీ హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎలా తరలించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, బందోబస్తు నిర్వహించారు. సోమవారం ఉదయం మరోసారి ఆందోళన చేశారు. 'మా నాన్న చావుకు ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే' కారణమని మృతుడి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాంచందర్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

# మానసిక క్షోభ భరించలేక..

- పురుగుమందు తాగిన మహిళ
- చికిత్స పొందుతూ మృతి

**దోమ:** కూతురు, కొడుకు మరణంతో పన్నెండేళ్లుగా మానసిక క్షోభను అనుభవిస్తున్న మహిళ పురుగు మందు మృతిచెందింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన దొబ్బలి మైబమ్మ(55) ఐదుగురు సంతానం. వీరిలో 12 ఏళ్ల క్రితం ఓ కుమార్తె, ఎనిమిదేళ్ల క్రితం ఓ కుమారుడు అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె మానసిక వేదనతో కుంగిపోతోంది. ఇరుగుపొరుగు వారి



మైబమ్మ (ఫైల్)

తోనూ మాట్లాడకుండా ఇంట్లోనే కూర్చునేది. ఈ క్రమంలో ఆదివారం ఆమె పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే నారాయణపేట జిల్లా కోస్గిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మైబమ్మ మృతి చెందారు. ఆమె కుమార్తె నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సరదాగా వెళ్లి అనంతలోకాలకు

- కాకరణవేణి ప్రాజెక్టులో మునిగి బాలుడి దుర్మరణం
- గోన్యానాయక్ తండాలో విషాదం

**దోమ:** సరదా కోసం బయటకు వెళ్లిన ఓ బాలుడు అనంతలోకాలకు చేరాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బుద్లాపూర్ అనుబంధ గోన్యానాయక్‌తండాకు చెందిన శంకర్, కవితకు ఓ కొడుకు, కూతురు సంతానం. కుమారుడు బాలాజీ(13) పరిగి పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే స్నేహితులతో కలసి సరదాగా ఆడుకున్న అతను.. ఆదివారం పలువురితో కలిసి సరదాగా బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం వేళ అందరూ కలిసి బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమల్ల సమీపంలోని కాకరణవేణి ప్రాజెక్టుకు చేరుకున్నారు. ఈత



బాలాజీ (ఫైల్)

కొట్టేందుకు అందరూ కలిసి నీళ్లలోకి దిగారు. ఈత రాని బాలాజీ సైతం వీరిని అనుసరించి మునిగిపోయాడు. వెతికినా కనిపించకపోవడంతో మిగిలిన వారు ఇంటి బాట పట్టారు. సాయంత్రమైనా కుమారుడు ఇంటికి చేరకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. ఈక్రమంలో ప్రాజెక్టు వద్దకు వెళ్లినట్లు స్థానికులు చెప్పడంతో అక్కడికి చేరుకుని వెతికారు. అప్పటికే చీకటి పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం కుటుంబీకులు వెళ్లి చూడగా బాలాజీ శవమై తేలాడు. ఇది చూసిన తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. మృతదేహానికి పరిగి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య

**తాండూరు రూరల్:** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం సరికాదన్నారు. కార్పొరేట్ యాజమన్యాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్‌లతో దేశంలో ఉన్న 55 కోట్ల మంది కార్మికుల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికావడం తథ్యమన్నారు. న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగే ఉమ్మడి కార్మిక సంఘాల జాతీయ సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీసీఐ ఫ్యాక్టరీ జీఎంను కలిసి సీసీఐ కార్మికుల సమ



సీసీఐ ఫ్యాక్టరీ జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

స్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం వేజ్ బోర్డు ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలశంకర్, నాయకులు రవీందర్, వంశీకృష్ణ, రెడ్డి సురేష్, దస్తప్ప, లాహెర్ బాషా, మోహన్, వెంకటేష్, దశరథ్‌గౌడ్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

### నేడు జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం

**బొంరాస్‌పేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలను మంగళవారం నిర్వహించనున్నట్లు జీహెచ్ఎం, ఎంఈఓ హరిలాల్ తెలిపారు. మధ్యాహ్నం వీడ్కోలు కార్యక్రమంలో ప్రముఖ మానసికవేత్త, ప్రేరణ కర్త డాక్టర్ పి.లక్ష్మణ్ ప్రేరణ కార్యక్రమాలు, సాయంత్రం వార్షికోత్సవంలో జిల్లా కలెక్టర్, డీఈఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పలువురు నేతలు హాజరుకానున్నారని చెప్పారు. విద్యార్థులచే సాంస్కృతిక ఉంటాయన్నారు. పేరొందిన పూర్వ విద్యార్థులకు సన్మానాలు, బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

### 20న తైబజార్ వేలం

**కొడంగల్:** మున్సిపల్ పరిధిలోని తైబజార్ (అంగడి బజార్)కు ఈ నెల 20న వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలరాం నాయక్ సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోడానికి మంగళవారం చివరి రోజని చెప్పారు.

### చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**మాడ్గుల:** మండల పరిధి కొల్కులపల్లిలో వైన్ షాప్‌లో చోరీకి పాల్పడిన నేనావత్ సాయికుమార్‌ను సోమవారం అరెస్టు చేశామని సీఐ వేణుగోపాలరావు తెలిపారు. జనవరి ఒకటిన మద్యం దుకాణంలో దొంగతనం చేశాడని, నిందుతున్ని మాడ్గుల ఎక్స్ రోడ్ వద్ద అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామని సీఐ వివరించారు.

### ఇటుక బట్టీలపై విజిలెన్స్ దాడులు



యజమానులపై కేసు నమోదు చేస్తున్న అధికారులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ఇటుక బట్టీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. వ్యవసాయ పొలాలకు వినియోగించే విద్యుత్‌ను, అక్రమంగా పరిశ్రమలకు వాడుతున్నారన్న సమాచారంతో విజిలెన్స్ ఏడీ మోషా ఆధ్వర్యంలో సోమవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. 5 చోట్ల కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. తప్పనిసరిగా కమర్షియల్ మీటర్లు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

# విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

**పూడూరు:** విద్యార్థులు చిన్నప్పటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మండలంలోని మేడిపల్లికలాన్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఎఫ్ఎల్ఎన్ పురస్కారాల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చన్గోముల్ కాంప్లెక్స్ పరిధిలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులకు స్థానిక పాఠశాలలో క్విజ్ నిర్వహించారు. అంగడిచిట్టంపల్లి పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రేరణ పురస్కార సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో మెంటర్‌లు నాగరాజు, నవీన్, రాకేష్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు భయాందోళన చెందొద్దు

అటవీశాఖ తాండూరు సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్

**తాండూరు రూరల్:** మండల పరిధిలోని మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామస్తులు భయందోళన చెందవద్దని అటవీశాఖ తాండూరు సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్ సూచించారు. మల్కాపూర్ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ క్వారీలో చిరుతపులి పిల్ల సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం మల్కాపూర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ క్వారీ సమీపంతో పాటు సంగెంకలాన్ శివారులో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యానాయక్ మాట్లాడుతూ... తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారిణి శ్రీదేవి సరస్వతి ఆదేశాల మేరకు మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుతపులి పిల్ల సంచరిస్తే ట్రాప్ కెమెరాలు దృశ్యాలు నమోదు అవుతాయని చెప్పారు. అట్టి దృశ్యాల ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై చర్చిస్తామన్నారు. కార్మికులతో పాటు ఆయా గ్రామస్తులు చిరుతపులి పిల్ల కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్ మల్లయ్య, సిమెంట్ ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

# లారీ, బైక్ ఢీ.. యువకుడి మృతి



లారీ కిందకు దూసుకెళ్లిన బైక్



సాయికుమార్ (ఫైల్)

**చేవెళ్ల:** లారీ బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలోని హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై సోమ వారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన భగిర్తి వెంకటయ్య, సుమిత్రలకు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు బి.సాయికుమార్(20) ఉన్నారు. ఇద్దరు కూతుర్ల వివాహం చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సాయి పదో తరగతితోనే చదువు ఆపేసి, ప్రైవేటు పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎప్పటి లాగే యువకుడు పనికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ యువకుడు నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను ఎగిరి కిందపడగా.. బైక్‌తో పాటు యువకుడి తలపై నుంచి లారీ ముందుకు దూసుకుపోయింది. దీంతో సాయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వివరాలు సేకరించారు. లారీని డ్రైవర్ అక్కడే వదిలేసి పారిపోయాడు. మృతుడు సాయికుమార్‌గా గుర్తించిన పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణంతో ఆ తల్లిదండ్రుల రోదనలు అందరినీ కలచివేశాయి.

# ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తే సహించం



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- కలెక్టరేట్ ఎదుట 48 గంటల దీక్ష

**ఇబ్రహీంపట్నం రూరల్:** అంగన్ కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కమిటీ హెచ్చరించింది. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజ్యలక్ష్మి, కవితల ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, చంద్రమోహన్‌లు మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి, పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను తీసుకురావాలని చూస్తుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధాన చట్టాన్ని అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

**మూత పడనున్న ఐసీడీఎస్‌లు:**

పీఎం శ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ కేంద్రాలను 28 జిల్లాల్లో 56 కేంద్రాలను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి తెరలేపిందని ఆరోపించారు. తద్వారా ఐసీడీఏస్‌లు పూర్తిగా మూతపడే అవకాశం లేకపోలేదని, దీంతో పేద పిల్లలకు పౌష్టికాహారం దూరం కానుందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు అనేక హామీలను ఇచ్చి నేడు, విస్మరిస్తుందని విమర్శించారు. టీఏ, డీఏలు పెంచాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీఎల్‌ఓ డ్యూటీలు రద్దు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల బలోపేతానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జగన్, జిల్లా నాయకులు కిషన్, దేవేందర్ పాల్గొన్నారు.

**కలెక్టరేట్ వద్దే రాత్రి బస**

48 గంటలు దీక్షకు పిలుపునివ్వడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రాత్రి కలెక్టరేట్ కార్యాలయం వద్దే బస చేశారు. అక్కడే వంటావార్పు చేశారు. రోడ్డుపైనే టెంట్ల కింద పడుకున్నారు. ఆట పాటలతో బతుకమ్మలు ఆడి సరదాగా గడిపారు. డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు కదిలేది లేదని స్పష్టంచేశారు.

### కదులుతున్న కారులో మంటలు

సకాలంలో స్పందించడంతో తప్పిన ముప్పు

**లాలాపేట:** హబ్సిగూడ ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు.. వారాసిగూడకు చెందిన నాగరాజు జనగామ నుంచి బస్సులో వచ్చిన తన భార్యా పిల్లలను ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద మారుతి స్విఫ్ట్ కారులో ఎక్కించుకుని (ఏపీ 09 బీజే 2366) ఉప్పల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్నాడు. వీరి కారు హబ్సిగూడ రోడ్డు నెంబర్ 6 వద్దకు రాగానే ఇంజిన్ వేడెక్కి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ నాగరాజు వెంటనే కారును రోడ్డు పక్కన నిలిపాడు. స్థానికులు, పోలీసుల సహాయంతో కారు వెనక డోర్లు ఓపెన్ చేసి భార్యా పిల్లలను కూడా బయటకు దింపారు. సమాచారం అందుకున్న మౌలాలి ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# సారు రూటు.. సప'రేటు'

**పైసలిస్తేనే పని కదిలేది**
- అవినీతి నిరోధక శాఖకు అందిన ఫిర్యాదులు
- ప్రభుత్వానికి చేరిన నివేదిక

**బషీరాబాద్:** అక్రమ సంపాదనకు అలవాటుపడిన ఓ రెవెన్యూ అధికారి చేతులు తడపందే ఏ పనీ చేయడం లేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు ఎవరైనా సరే ముడుపులు ముట్టజెప్పందే ఫైలు ముట్టుకోడు. ఎంతోకొంత అప్పగించందే సారు సంతకం పెట్టరు. కొంతమంది అక్రమార్కులతో కుమ్మక్కై ప్రభుత్వ సంపదను పక్కదారి పట్టిస్తున్నారు. ఈయన అవినీతి లీలలపై ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సారు తీరుపై నిఘా పెట్టిన అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ విషయం తెలియడంతో బదిలీ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

- ఇటీవల ఓ రైతు తన భూమి పట్టా మార్పు కోసం రెవెన్యూ కార్యాలయానికి వచ్చాడు. ఒరిజినల్ పాసు పుస్తకం ఎక్కడో పోయిందని, పట్టా మార్పు చేయాలని అడిగాడు. అయితే పని కావాలంటే రూ.10 వేలు కావాలని మధ్యవర్తి ద్వారా రాయభారం నెరిపాడు. అంత డబ్బు తన వద్ద లేదని రైతు ఎంత వేడుకున్నా కనికరించలేదు. చివరకు ఈ విషయం మీడియాకు లీక్ కావడంతో చివరికి రూ.5 వేలు తీసుకుని పని పూర్తి చేశాడు.



- మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోర్టు కేసులు ఉన్న చాలా భూములకు పట్టా మార్పులు అవుతున్నాయి. ఇందుకోసం సంబంధిత వ్యక్తుల నుంచి భారీగా డబ్బులు తీసుకుంటున్నాడు. తాను సేఫ్ సైడ్‌లో ఉండేందుకు ముందుగానే వారితో నోటరీ రాయించి తీసుకుంటున్నాడు.
- ఇటీవల కొత్లాపూర్ గ్రామంలోని అసైన్డ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు పట్టా చేశాడు. ఇందుకోసం వారి నుంచి భారీగా డబ్బు తీసుకున్నాడు.
- నావంద్గీ ఇసుక రీచ్‌లో అనుమతుల చాటున అవినీతి పర్వం కొనసాగిస్తున్నాడు. నాలుగు ట్రాక్టర్లకు పర్మిట్లు ఇచ్చి పది ట్రాక్టర్ల ఇసుక తరలిస్తూ అంతా కలిసి సొమ్ము చేసుకుంటున్నాడు.
- నావంద్గీ, నీళ్లపల్లిలోని ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తనకు కావాల్సింది తీసుకుంటున్న సదరు అధికారి.. సెలవు రోజుల్లో పని చేసుకోండి అంటూ మౌఖిక అనుమతులు ఇస్తున్నాడు.
- పాసుపుస్తకాలు బ్యాంకులలో తనఖా పెట్టిన వారి పేర్లపై ఉన్న భూములను యథేచ్ఛగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నాడు.
- సీలింగ్, అసైన్డ్, గైరాని భూముల్లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇందులో సదరు పెద్ద సారుదే ప్రధాన పాత్ర అనేది బహిరంగ రహస్యం.
- కొర్విచెడ్, జీవన్గీ, ఎకాల్మాయి, క్యాద్గీరా నాపరాతి గనుల్లో లీజులు లేని వారి నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటూ అక్రమార్కులు గనులు తవ్వుకోవడానికి మద్దతు ఇస్తున్నాడు. డబ్బులు ఇవ్వని వారి గనులను సీజ్ చేయడం.. ఆ గనుల్లో నుంచి కోత యంత్రాలను కార్యాలయానికి తీసుకురావడం పరపాటిగా సాగుతోంది.